సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way




సంపుటి : 02 | సంచిక : 162 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం, 06 నవంబర్ 2025 | పేజీలు : 04

## కనులపండువలా

# దీపోత్సవం









**కార్తీక పౌర్ణమి** వేడుకులను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా చిన్నపెద్దలంతా ఉదయాన్ని సాన్నమాచరించి నూతన వస్త్రాలు ధరించి దగ్గరలోని ఆయాలు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల్లో కార్తీక పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఇక సాయంత్రం ఆయా ఆలయాల్లో దీపోత్సవం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెగించి మొక్కులు చెల్లించారు. జనగామ పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ స్వయంభూ సోమేశ్వర స్వామి దేవస్థానం భక్తజనులతో కళకళలాడింది. ఈ పవిత్ర క్షేత్రంలో భక్తులతో కలిసి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రత్యేక పూజలు చేసి, గిరిప్రదక్షిణ చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అఖండ జ్యోతి ప్రజ్వలన చేసి, భక్తులతో కలిసి దీపారాధనలో పాల్గొన్నారు. ఇక కొడ్వటూరు స్వయంభు శ్రీ సిద్దేశ్వర స్వామివారి దర్శనానికి రాష్ట్రంలోని నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో భక్తులతో ఆలయం కిటకిటలాడింది. కొమురవెల్లి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జ్వాలాతోరణం ప్రజ్వలనం కార్యక్రమం నిర్వహించారు.

- ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు
- కిటకిటలాడిన శివాలయాలు
- పాలకుర్తిలో దివ్య అఖండ జ్యోతి ప్రజ్వలన





# ఆధ్యాత్మిక మార్గమే అత్యున్నత జీవిత లక్ష్యం

**జనగామ, మన చౌరాస్తా :** పవిత్ర కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీరాంనగర్ కాలనీలోని హనుమాత్ రామనాథ సహిత శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో అత్యంత వైభవోపేతంగా సామూహిక సత్యనారాయణ వ్రతములు నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ మోహనకృష్ణ భార్గవ వైదిక నేతృత్వంలో ప్రాతఃకాలం శ్రీ సీతారామచంద్రస్వామి వారలకు విశేషంగా పంచామృత అభిషేకాలు, అలంకరణ జరిపారు. అనంతరం సామూహిక సత్యనారాయణ వ్రతములో గణపతి పూజ, రక్షాబంధన, కలశారాధన, సత్యనారాయణ ఆరాధన జరిపారు. అనంతరం వ్రత కథలను అందులోని ధర్మసూక్ష్మాలను విశ్లేషణాత్మకంగా వర్ణిస్తూ బోధించారు. ఈ కార్యక్రమంలో మోహనకృష్ణ మాట్లాడుతూ ఆధ్యాత్మిక సాధన, ధర్మాచరణ, కర్మాచరణ మానవ జీవితంలో ముఖ్యమైన అంశాలని, వైదిక మార్గంలో పురుషార్థాలను జయించి మోక్ష సాధన వైపు అడుగులు వేయాలని ఈ సత్యనారాయణ వ్రత కథలు కూడా మన జీవితంలో మార్పు తీసుకువస్తాయని అన్నారు. సత్యనారాయణ ఆరాధన ఫలితంగా సకల కష్టాలు, దుఃఖాలు తొలిగిపోయి సుఖ సంపదలతో భోగభాగ్యాలతో వర్ధిల్లుతారని, సకల అభీష్టాలు నెరవేరుతాయని భక్తులను మహాదాశీర్వచనం అందించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో కందాడి యాదగిరి, మల్లారెడ్డి, నాగరాజురెడ్డి, యెలసాని రాంబాబు, కృష్ణమూర్తి, జక్క ఉపేందర్ రెడ్డి, గజ్జెల జనార్ధన్ రెడ్డి, చంద్రమౌళి, శ్రీనివాస్, వేణుగోపాల్, పోచన్న తదితరులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం దేవాలయం ప్రాంగణంలో విశేషంగా కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు, గోమయ దీపాలతో గోమాత ఆకృతిలో దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో అలివేలు, వరలక్ష్మి, జ్యోతి, శ్రీవాణి, స్వరూప తదితర మహిళా భక్తులు పాల్గొన్నారు.

### మంద హెచ్చుల గొల్లవారి

# గంగమ్మ ప్రతిష్ఠాపన

భీమదేవరపల్లి, మన చౌరాస్తా : గొల్లవారి ప్రత్యేక ఆరాధనగా పరిగణించబడే మంద హెచ్చుల గంగమ్మ ప్రతిష్ట కార్యక్రమం హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో ఆదరి వారి ఇంట గ్రామీణ సుందర వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. గంగమ్మ తల్లితో పాటు గ్రామ రక్షక దేవతలు అయిన పోతురాజు, మైసమ్మ, అన్నపూర్ణమ్మ, పోలేరమ్మలకు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా గొల్లవారి పశుసంవర్ధక జీవన విధానంలో దేవతల స్థానం, పూజా విధానాల్లో జంతువుల ప్రాముఖ్యత స్పష్టంగా కనిపించింది.ఉదయం మొదట మేకల మందను శుభ్రపరచి, వాటికి పసుపు, కుంకుమతో తిలకాలు పెట్టి దేవతల సమక్షంలో నిలబెట్టారు. మేక, ఆవు, ఎద్దు వంటి పశువులు గంగమ్మ ఆశీస్సులు పొందిన వారని, వాటిని దైవ స్వరూపాలుగా భావించడం గొల్లవారి ఆచారమని పెద్దలు వివరించారు. పశువులు ఆరోగ్యంగా ఉండాలని, మందలో శాంతి, అభివృద్ధి కలగాలని గంగమ్మను ప్రార్థించారు.పూజ అనంతరం దుర్షెడు గ్రామానికి చెందిన భూపతి వంశీయుల తరపున కనకయ్య మంద హెచ్చుల గంగమ్మ పురాణంను ఆధారంగా తీసుకొని గాథలను వివరించారు. గంగమ్మ తల్లి గొల్లవారి మందకు వచ్చిన వ్యాధులను పారద్రోలిన కథ, అడవి జంతువుల దాడి నుంచి రక్షించిన పురాణాలు, చెడు శక్తులను తరిమేసిన గాథలు గ్రామోత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డప్పు వాయిద్యాలు, జానపద గీతాలు, కోలాటాలు ఆ కథలకు జీవం పోశాయి. పోతురాజును గ్రామ కాపరిగా సింబాలిక్‌గా ముందుకు నడిపించి, మేకలతో కలిసి ఊరేగింపు జరిపారు. ఈ సందర్భంగా గంగమ్మకు నైవేద్యంగా పాలుగైన, చిగురు దుంపలు, పులిహోర, బెల్లం పాయసం సమర్పించారు. పశుప్రధాన జీవితం, ప్రకృతి పూజ, జీవుల పట్ల ప్రేమ ఈ వేడుకలో ప్రధానంగా ప్రతిఫలించినట్టుగా కనిపించింది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఆదరి శ్రీనివాస్ మాట్లాడుతూ "గొల్లవారి గంగమ్మ పూజ పశువుల ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తుంది. మేక, ఆవు, ఎద్దు కేవలం జీవనోపాధి కాదు, అవి దైవ ఆశ్రయమైన జీవరాశులని అన్నారు. మన సంప్రదాయం ప్రకృతి, పశువులతో ఎంత ముడిపడి ఉందో నేటి తరం అర్థం చేసుకోవాలని తెలిపారు. సాయంత్రం హారతి, మంద హెచ్చుల జాత్ర పురాణంకు ముగింపు కార్యక్రమంగా, గంగమ్మ విగ్రహానికి తాంబూలాలు, మంగళారతులు సమర్పించారు. కుటుంబాలు, పిల్లలు, యువత ఉత్సాహంగా పాల్గొని సంప్రదాయం వైభవాన్ని మరింత అందంగా నిలబెట్టారు.





### యువకులపై కేసులు

# పెట్టడం సరికాదు

### సీపీఎం జనగామ మండల కార్యదర్శి నరేందర్

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ నియోజకవర్గంలోని రహదారులు, బ్రిడ్జిల సమస్యలు పరిష్కరించాలని పోరాడుతున్న జనగామ మండలానికి చెందిన యువకులు, యువజన సంఘాల నాయకులు యాసారపు కర్ణాకర్, బాల్నే ఉమాపతి మరికొందరిపై కేసులు పెట్టి జైలుకు పంపడం సరికాదని సీపీఎం జనగామ మండల కార్యదర్శి బోడ నరేందర్ అన్నారు. బుధవారం సీపీఎం పార్టీ కార్యాలయంలో మండల నాయకులు పోత్కనూరి ఉపేందర్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం నాలుగు సంవత్సరాల క్రితం బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయకపోవడం ప్రజలకు శరఘాతంగా మారిందన్నారు. అప్పుడు ఎమ్మెల్సీగా నేడు ఎమ్మెల్యేగా ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురాకపోవడం ఫలితంగా జనగామ నుంచి కరీంనగర్ వరకు వందలాది గ్రామాల ప్రజలు తీవ్రమైన రవాణా అసౌకర్యానికి గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలుగా చేపడుతున్న ప్రజాపాలనలో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయకపోవడం తీవ్రమైన అలసత్వానికి నిదర్శనమే అన్నారు. దీనిని ప్రశ్ని వారిపై కాంగ్రెస్ పాలకులు కక్ష సాధింపులకు దిగి కేసులు పెట్టి రిమాండ్ కు పంపడం ఇది ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు రమావత్ మీర్య నాయక్, గురజాల లక్ష్మినరసింహ రెడ్డి, బైరగోని మల్లేశం, మండల కమిటీ సభ్యులు తాండ్ర ఆనందం, బెజ్జరబోయిన మల్లేష్, ఏల శ్రీనివాసరెడ్డి, గుండెల్లి రాజు, సాంబరాజు, దుర్గాప్రసాద్, బండిరాజుల శ్రీరాములు, కొడిమాల ప్రభాకర్, కూరాకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### హడుప్సా జిల్లా

# ఉపాధ్యక్షుడిగా ఆదిరెడ్డి

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** గ్రామీణ విద్యా అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ప్రముఖ విద్యాసేవకుడు కాశిరెడ్డి ఆదిరెడ్డి హనుమకొండ హడుప్సా జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ గ్రామానికి చెందిన ఆయన ఎస్ఆర్‌కే స్కూల్ చైర్మన్‌గానూ విద్యారంగంలో సేవలందిస్తున్నారు. మంగళవారం హనుమకొండలో జరిగిన హడుప్సా జిల్లా కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. గత రెండు దశాబ్దాలుగా విభిన్న పదవుల్లో సేవలందించిన ఆదిరెడ్డి, ఉమ్మడి కరీంనగర్ ట్రస్మ మీడియా ఇన్‌ఛార్జి, వడుప్సా జిల్లా ఉపాధ్యక్షుడు, రాష్ట్ర ట్రస్మ ఉపాధ్యక్షుడు, 15 ఏళ్లుగా భీమదేవరపల్లి మండల్ అధ్యక్షుడు వంటి పదవుల్లో కీలక పాత్ర పోషించారు. గ్రామీణ ప్రైవేట్ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించే దిశగా, క్రమశిక్షణ, డిజిటల్ ఎడ్యుకేషన్ విస్తరణ, విద్యార్థుల వ్యక్తిత్వాభివృద్ధి కోసం తీసుకున్న చర్యలు ఆదిరెడ్డికి జిల్లా విద్యా వర్గాల్లో ప్రత్యేక గుర్తింపునందించాయి. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆదిరెడ్డి మాట్లాడుతూ "గ్రామీణ విద్యావ్యవస్థను బలోపేతం చేయడం, ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం, హడుప్సా కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లడం నా లక్ష్యం" అని తెలిపారు. తనకు మద్దతిచ్చిన రాష్ట్ర చీఫ్ అడ్వైజర్ యాదగిరి శేఖర్ రావు, జిల్లా చీఫ్ అడ్వైజర్ వర్ధమాన్ జనార్ధన్, జిల్లా అధ్యక్షులు తక్కల్లపల్లి బుజ్జి బాబు, నాయకులు రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శంకర్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, కోశాధికారులు, హడుప్సా ప్రతినిధులు సహా పలువురు పాల్గొన్నారు.



# నల్ల నర్సింహులుకు ఘన నివాళి

**పాలకుర్తి, మన చౌరాస్తా :** వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అపార స్ఫూర్తి రగిలించిన ఉద్యమ వీరుడు నల్ల నర్సింహుల వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాల సంఘం మండల అధ్యక్షులు మాచర్ల సారయ్య ఆధ్వర్యంలో నల్ల నర్సింహులు కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ తెలంగాణా రైతాంగ సాయుధ పోరు కెరటంలా మారిన నల్ల నర్సింహులు ఈ భూమి బిడ్డల గౌరవానికి పెనుగులాట సాగించిన విప్లవ దీప్తి అని కొనియాడారు. కార్యక్రమంలో దేవసాని కృపాకర్, కూరపాటి సుదర్శన్, శ్రీరామ్ సుధాకర్, బిట్ల రాం ప్రభాకర్, పోగు వాసుదేవ్, పోగు రుసెంద్రం, శ్రీరామ వెంకటేశ్వర్లు, బైరు భార్గవ్, వైట్ల రామ్మూర్తి, మార్గం సారంగపాణి, రాపోలు సత్యనారాయణ, పోగు బాలరావు తదితరులు పాల్గొన్నారు.







# కొమురవెల్లిలో ప్రత్యేక పూజలు



**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం కొమురవెల్లి మల్లికార్జున దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం శ్రీస్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, మధ్యాహ్నం ఏకాదశరుద్రాభిషేకపూర్వక అన్న పూజ, సాయంత్రం గంగి రేగు చెట్టు ప్రాంగణంలో లక్షవర్తికా దీపోత్సవం, అనంతరం జ్వాలా తోరణం ప్రజ్వలనం చేసి శ్రీస్వామి అమ్మవార్లను జ్వాలాతోరణ కింద నుంచి అత్యంత వైభవపేతంగా తీసుకెళ్లారు. అనంతరం వచ్చినటువంటి భక్తులందరూ కూడా జ్వాలాతోరణాన్ని దాటారు. కార్యక్రమములో ఆలయ కార్య నిర్వహణ అధికారి టి.వెంకటశ్, స్థానిక సీఐ శ్రీనివాస్, కొమురవెల్లి ఎస్ఐ రాజు గౌడ్, సహాయకార్యనిర్వహణాధికారి శ్రీనివాస్, ధర్మకర్తలు మరియు అధికారులు ఒగ్గు పూజారులు,భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో దీపోత్సవం నిర్వహించారు.

## కిటకిటలాడిన సిద్ధుల గుట్ట



**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** పవిత్రమైన కార్తీక మాసం చివరి రోజు కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని కొడవటూరు గ్రామంలో స్వయంభు శ్రీ సిద్దేశ్వర స్వామివారి దర్శనానికి రాష్ట్రంలోని నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తిశ్రద్ధలతో దీపారాధనలతో శివ స్మరణలతో ఆ సిద్దేశ్వరుని దర్శించుకున్నారు. ఇక్కడికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు అనేక ఏర్పాట్లను చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఓం నమశ్శివాయ మాట్లాడుతూ కార్తీక మాసం ఎంతో పవిత్రమైందని సూర్యోదయానికి ముందే స్నానం చేసి ఆ పరమశివుని దర్శించుకుంటే చేసిన పాపాలన్నీ తొలగి విశిష్టమైన పుణ్యం దక్కుతుందని, తులసి పూజ, పారాయణం చేయడం వల్ల కూడా భక్తులకు పుణ్యం దక్కుతుందని శివయ్య కృపతో రాష్ట్రం పాడిపంటలతో సస్యమలంగా ఉండాలని పరమశివుని వేడుకున్నట్లు తెలిపారు.




# మా బాగోగులు పట్టించుకోవడం లేదు

■ **భూమి పట్టా రద్దు చేయాలంటూ వృద్ధ దంపతుల విజ్ఞప్తి**

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు మట్టెడ ఆదాం, లక్ష్మి తమకు పుట్టిన చిన్న కుమారుడు తమ బాగోగులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఆయనకు ఇచ్చిన భూమి పట్టాను రద్దు చేయాలని అధికారులను కోరారు. ఈ మేరకు వారు హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్‌ను కలసి ఫిర్యాదు చేశారు.వివరాల్లోకి వెళ్తే, ఆదాం పేరుపై ఉన్న ఐదు ఎకరాల భూమిలో నుండి ఇటీవలే ఇద్దరు కుమారులకు చెరో రెండు ఎకరాల చొప్పున పట్టా చేసారు. పెద్ద కుమారుడు రవి తల్లిదండ్రుల సేవలో ఉండి వారి సంక్షేమం చూసుకుంటున్నాడు. అయితే చిన్న కుమారుడు దేవేందర్ మాత్రం తల్లిదండ్రులను పట్టించుకోకుండా, నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తూ మానసికంగా వేధిస్తున్నాడని వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో దేవేందర్‌కు ఇచ్చిన రెండు ఎకరాల పట్టాను రద్దు చేసి తిరిగి తమ పేరిట చేయాలని ఆర్డీవోకు వృద్ధ దంపతులు వినతి పత్రం సమర్పించారు. ఫిర్యాదు స్వీకరించిన ఆర్డీవో రాథోడ్ రమేష్ మాట్లాడుతూ విషయంపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటాం అని తెలిపారు.

# జాతీయ స్థాయికి ఎంపికైన ముల్కనూర్ క్రీడాకారుడు



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన మాడుగుల ఆదిత్య అద్భుత ప్రతిభ కనబరచాడు. జేఎన్ఎస్ మైదానం, హనుమకొండలో జరిగిన జిల్లా స్థాయి అండర్-19 విభాగం 400 మీటర్ల హడిల్స్ రన్నింగ్ పోటీల్లో విజయం సాధించి రాష్ట్ర స్థాయికి అర్హత పొందిన ఆయన, బుధవారం హైదరాబాద్ జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని గోల్డ్ మెడల్ సాధించాడు. దీంతో జాతీయ స్థాయి పోటీలకు ఆయన ఎంపికయ్యాడు. చిన్నప్పటి నుంచే క్రీడలపై మక్కువతో పలు పోటీల్లో విజయం సాధిస్తూ, అనేక అవార్డులు గెలుచుకున్న ఆదిత్య ప్రస్తుతం ఏకేవీఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం (ఎంపీసీ) చదువుతున్నాడు. ఆదిత్య ప్రతిభను కొనియాడుతూ హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ సుదర్శన్ రెడ్డి, ప్రిన్సిపాల్ భూపతి శ్రీకాంత్, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు.

# 9న కార్తీక మాస సామూహిక వనభోజనలు



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలోని శివభక్త మార్కండేయ ఆలయంలో బుధవారం రోజున పద్మశాలి కుల బాంధవుల కార్తీక మాస సామూహిక వనభోజన మహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగినది. ఈ కార్యక్రమం అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు ఊసకోయిల ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు బచ్చు ఆనందం, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఊసకోయిల ప్రకాష్ మాట్లాడుతూ ఈ ఆదివారం ఎర్రగట్టుగుట్ట లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 9న జరిగే సామూహిక వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా పద్మశాలి కులస్తుల మధ్య సత్సంబంధాలు, స్నేహభావం ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం యూత్ అధ్యక్షులు ఉడుత శ్రీనాథ్, ముల్కనూర్ పద్మశాలి యువజన సేవా సంఘం అధ్యక్షులు చిదురాల శ్రీనివాస్, చిదురాల కిరణ్, ఆడెపు వెంకటయ్య, రాపల్లి రాజు, బండారి శ్రీనివాస్, చిదురాల ఐలయ్య, దార్ణ గణేష్, దాసరి కనకయ్య,సబ్బనీ రమేష్, వెంగళ రామస్వామి, దార్ణ రవీందర్, ఈగ శ్రీనివాస్, మోహన్, ఆడెపు రమేష్, పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

# రోడ్ల పునర్నిర్మాణానికి శంకుస్థాపన



**పాలకుర్తి, మన చౌరాస్తా :** వర్షాలతో పాలకుర్తి మండల పరిధిలోని పలు గ్రామాల రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా వాల్మీడి, ముత్తారం గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారి పూర్తిగా పాడైపోయి, గ్రామాల మధ్య రాకపోకలు అస్తవ్యస్తమయ్యాయి. రైతులు తమ పంటలను మార్కెట్కు తరలించలేక ఇబ్బందులు పడగా, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడం కష్టమైపోయింది. ఈ పరిస్థితిని గమనించిన పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి వెంటనే స్పందించారు. కోట్ల రూపాయల వ్యయంతో కొత్త రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన ఎమ్మెల్యే చేశారు. యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. ధ్వంసమైన దారి కి మళ్లీ నిర్మించడానికి ప్రభుత్వం నుంచి మూడు కోట్ల నిధులను కేటాయించాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. బ్లాక్ అధ్యక్షుడు సత్యనారాయణ, మండల అధ్యక్షుడు కుమారస్వామి, ఎర్రబెల్లి రాఘవరావు, భాస్కర్ గౌడ్, లావుడియా మంజుల, యాకాంతరావు తదితరులు పాల్గొన్నారు.



# జనగామలో ఎమ్మెల్యే పల్లా ధర్నా

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ-హుస్నాబాద్ ప్రధాన రహదారి పనులు గత రెండు సంవత్సరాలుగా నిలిచిపోయినందున తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ గ్రామస్తులు అరెస్టు చేయడం సరికాదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. వారి అక్రమ అరెస్టుపై అభ్యంతరం వ్యక్తం చేసిన జనగామ ఎమ్మెల్యే పల్లా బుధవారం ఉదయం వారితో ములాఖత్ ద్వారా వారిని కలిశారు. అరెస్టు చేసిన గ్రామస్తులను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జనగామ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. చౌరస్తాలో రెండు గంటల పాటు బైఠాయించి నిరసన తెలిపారు. బ్రిడ్జ్, రహదారి పనులు వెంటనే ప్రారంభించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.





## హరీశ్‌రావును పరామర్శించిన

# డా. తాటికొండ రాజయ్య

**సిద్దిపేట, మన చౌరాస్తా :** మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ ఇటీవల కన్నుమూశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య హైదరాబాద్‌లోని తన్నీరు కుటుంబ స్వగృహానికి వెళ్లారు. డాక్టర్ రాజయ్య, సత్యనారాయణ మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, హరీష్ రావు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కుటుంబానికి సాంత్వన చెల్లిస్తూ, "సత్యనారాయణ సాదాసీదా జీవితం గడిపిన మంచి మనిషి, సమాజానికి విలువైన మార్గదర్శకత్వం ఇచ్చిన వ్యక్తి" అని పేర్కొన్నారు. ఈ సందర్బంగా స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు కూడా హరీష్ రావు కుటుంబాన్ని పరామర్శించారు.



## సోమేశ్వర ఆలయంలో

# ప్రత్యేక పూజలు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా పాలకుర్తి శ్రీ సోమేశ్వర ఆలయంలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేసి పుష్పార్చన చేశారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.భక్తులు సంప్రదాయ దుస్తుల్లో, భక్తి భావంతో స్వామివారి సన్నిధిలో నమస్కరించి ఆరాధనలు చేశారు. గర్భగుడిలో లింగరూపంలో వెలసిన శ్రీ సోమేశ్వర స్వామివారి దర్శనం పొందిన భక్తులు ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయారు. ఆలయ పరిసరాలు "ఓం నమః శివాయ" నినాదాలతో మార్మోగాయి. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు.



## జీవన్ గ్రీన్ హోప్ సొసైటీ ఆధ్వర్యంలో

# కార్తీక పౌర్ణమి వేడుకలు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జీవన్ గ్రీన్ హోప్ సొసైటీ చైర్ పర్సన్ దూసరి ధనలక్ష్మి శ్రీకాంత్ దంపతులు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని 14వ వార్డ్ లోని ఆంజనేయ స్వామి దేవాలయం లో కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామివారికి పంచాభిషేకాలు, వడమాలలు, తమలపాకులతో అర్చనలు, అన్నప్రసాదాలు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్ పర్సన్ ధనలక్ష్మి మాట్లాడుతూ.. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు అలాగే మహా అన్నదాన కార్యక్రమం చేపట్టామని, పండగంటే అందరు ఒక చోట చేరి వేడుకలు జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు, వార్డ్ అభివృద్ధి కు అలాగే ప్రజల ఇబ్బందులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ సేవ చేయడమే తమ ఉద్దేశం అని అన్నారు. అలాగే తమ జీవన్ హోప్ సొసైటీ ఆధ్వర్యంలో నిత్యం సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, రాబోయే రోజుల్లో కూడా వార్డు ప్రజలకోసం సేవా కార్యక్రమాలు చేస్తామని అన్నారు.



